
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
శనివారం 2 ఆగస్టు 2025





వివాహ ఆహ్వానం

టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి, టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి దంపతుల కుమార్తె జయారెడ్డి వివాహం హైదరాబాద్‌కు చెందిన గుణ చైతన్యరెడ్డితో ఈ నెల 7న సంగారెడ్డిలో జరగనుంది. ఈ వివాహ వేడుకలకు హాజరు కావాలని ఆంధ్రజ్యోతి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణకు శుక్రవారం సంప్రదాయ పద్ధతిలో ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జగ్గారెడ్డి దంపతులు

-(సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి)





నల్లవాగు ప్రాజెక్టు కాల్వలో పూడిక తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఇక.. గంగమ్మ పరుగులు

నల్లవాగు ప్రాజెక్టు కాల్వ పూడికతీత

కల్హేర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు కుడి కాల్వ పూడికతీత పనులు శుక్రవారం ప్రాంభమయ్యాయి. ప్రధానమైన కుడి కాల్వలో కిష్టాపూర్ సమీపంలో శుక్రవారం ఈ పనులు ప్రారంభించినట్లు ప్రాజెక్టు డీఈఈ పవన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాల్వ, అత్యవసర కాల్వల్లోనూ పూడికను తొలగించనున్నట్లు వెల్లడించారు. నల్లవాగు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1,493 అడుగులు, ప్రస్తుతం 1,482 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల పదోన్నతులకు

కార్యాచరణ

నేటి నుంచి పది రోజులు ప్రక్రియ

సంగారెడ్డి జిల్లాలో 300 మందికి అవకాశం



సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పదోన్నతులకు రంగం సిద్ధమైంది. రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నేటి నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమై 10 రోజులు కొనసాగనుంది. ఈ నెల 7న జీహెచ్ఎం, 11న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి ఉత్తర్వులు వెలువడనున్నాయి. సంగారెడ్డి జిల్లాలో గెజిటెడ్ హెచ్ఎం 34 ఖాళీలు, పీఎస్ హెచ్ఎం 44, స్కూల్ అసిస్టెంట్ కేటగిరి 222, ఈ విధంగా మొత్తం 300 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ తేల్చింది. వీటిలో గెజిటెడ్ హెచ్ఎం పోస్టులను వంద శాతం, స్కూల్ అసిస్టెంట్లను 70 శాతం పదోన్నతితో భర్తీ చేస్తారు. మిగిలిన 30 శాతం పోస్టులు కొత్త నియామకాల ద్వారా భర్తీ చేస్తారు. గెజిటెడ్ హెచ్ఎంకు ఇతర జిల్లాల వారితో పోటీ పడాల్సి ఉండగా, స్కూల్ అసిస్టెంట్, పీఎస్ హెచ్ఎం పదోన్నతులు మాత్రం జిల్లా పరిధిలోనే దక్కనున్నాయి. కాగా ఈ నెల 2 న ఖాళీలు ప్రదర్శనతో పాటు సీనియారిటీ జాబితా విడుదల చేస్తారు. 3 న సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఇక విద్యాశాఖలో పదోన్నతులు సందడి మొదలు కానున్నది.

డిగ్రీలో ప్రవేశాలకు నేడు ఆఖరు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా ప్రవేశాలు పొందేందుకు నేడు (ఈ నెల 2) చివరి రోజని ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం తీసుకునేందుకు ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో తారా కళాశాలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి అడ్మిషన్లు పొందాలని ఆయన విద్యార్థులను కోరారు.



జనహిత జోష్

ఉత్సాహంగా కాంగ్రెస్ పాదయాత్ర

- తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- అడుగడుగునా జన నీరాజనం
- దామోదర్‌పై మహేశ్, మీనాక్షి, జగ్గారెడ్డి ప్రశంసలు
- నియోజకవర్గ అభివృద్ధిని చూసి అబ్బురం

టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర అందోలు నియోజకవర్గంలో శుక్రవారం జోర్దార్‌గా సాగింది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌కు మండలంలోని సంగుపేట చౌరస్తా వద్ద మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్, మరో మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభించి అందోలు శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థినులను కలిశారు. అందోలులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి జోగిపేటకు చేరుకుని బసవేశ్వర విగ్రహానికి పూలమాలలువేసి హనుమాన్ మందిర్ చౌరస్తా వద్దకు చేరుకున్నారు. దారిపొడుగునా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు, కేరింతలతో వెంట నడిచారు.

-జోగిపేట/జోగిపేట రూరల్, (ఆంధ్రజ్యోతి)



పాదయాత్రకు తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

మతం కాదు.. మానవత్వమే కాంగ్రెస్ సిద్ధాంతం : మంత్రి దామోదర్

మతం, కులం కాదు.. మానవత్వమే కాంగ్రెస్ సిద్ధాంతమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మతాన్ని అంతర్గతంగానే ఉంచుతూ ప్రజల బాగోగులే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పదేళ్లుగా తెలంగాణను బీఆర్ఎస్ దోచుకున్నదని ఆరోపించారు. గత 40 ఏళ్లుగా తమ కుటుంబం గెలుపోటములకు అతీతంగా అందోలు నియోజకవర్గంలో ఉందని, ఇది తన కుటుంబానికి దక్కిన గౌరమని పేర్కొన్నారు. తాను గెలిచి మంత్రిగా చేసిన ప్రతీసారి ఆయా శాఖల పరిధిలో నియోజకవర్గంలో రూ.వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో అందోలును ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దానని చెప్పారు. ఈసారి వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాని చెప్పారు.

హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలనన్నింటినీ సీఎం రేవంత్ ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం నెరవేరుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి 17 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చిన కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీకి ప్రజల సంక్షేమమే ప్రాధాన్యమని అన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే ప్రజల కోసం

మిగతా 7వ పేజీలో

'ఇందిరమ్మ ఇళ్ల'కు

ఆవాస్ ప్లస్ రీసర్వే

గ్రామ కార్యదర్శులకు పనిభారం

వివరాల నమోదుకు పరుగులు

దుబ్బాక, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మరోసారి సర్వే తప్పనిసరి అయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఇందిరమ్మ సర్వేను పరిగణనలోకి తీసుకోకపోవడంతో, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిధులు పొందేందుకు లబ్ధిదారుల వివరాలను 'ఆవాస్ ప్లస్' యాప్‌లో నమోదు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ నిర్ణయించింది. గ్రామ కార్యదర్శులకు ఇది పెద్ద సవాల్‌గా మారింది.

గత డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులుగా గుర్తించిన లబ్ధిదారుల వివరాలను ఆగస్టు 3లోపు ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేయాలి. అలా నమోదు చేసినవారికే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిధులు మంజూరవుతాయి. కేవలం రెండు రోజుల్లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయడం గ్రామ కార్యదర్శులకు సవాల్‌గా మారింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చే మొత్తంలో ఇంటికి రూ.72వేలు, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు అందిస్తుంది.

ఇందిరమ్మ సర్వేలో 3 విభాగాలు

గతంలో నిర్వహించిన ఇందిరమ్మ సర్వేలో మూడు విభాగాలుగా లబ్ధిదారులను వర్గీకరించారు. ఎల్1లో గుడిసెలు, రేకుల ఇళ్లు, పెంకుటిళ్లలో నివాసముంటూ, గతంలో గృహనిర్మాణ పథకాల ద్వారా లబ్ధి పొందని వారు. ఎల్2లో ఇళ్లు కట్టుకోవడానికి సొంత స్థలం లేనివారు, ఎల్ 3లో దరఖాస్తు చేసుకున్న వారిలో అనర్హుల వివరాలను నమోదు చేశారు. అయితే, ప్రస్తుతం ఎల్ 1 జాబితాలో ఉన్న లబ్ధిదారుల వివరాలను ఆవాస్ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆవాస్ ప్లస్ యాప్‌లో తప్పనిసరిగా లోకేషన్ దగ్గరకు వెళ్లి వివరాలు నమోదు చేయాలి. ఈ ప్రక్రియలో లబ్ధిదారుడి ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, అలాగే ముఖ చిత్రాన్ని ఫేస్ యాప్ ద్వారా తీసుకోవాలి. దీనికి గంట పడుతోంది. దీంతో, రేండ్రోజుల్లో వివరాల నమోదు సవాలుగా మారింది.

మర్కటం..

ప్రాణ సంకటం



వానర మూకల ఆగడాలు.. జనాలపై దాడులు

- ఆర్నెళ్లలో 671 మందికి కాటు
- ఇళ్లలోకి చొరబాటు
- మహిళలు, చిన్నారులను చూస్తే వెర్రి
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాగ్రహం

మెదక్ అంటే ఘనమైన చరిత్ర కలిగిన పట్టణమని, పచ్చని పంటలతో కళకళలాడే మెతుకు సీమ అని పేరుండేది. జిల్లా పేరు చెప్పగానే మెదక్ చర్చి, ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం, ఘనపురం ప్రాజెక్టు గుర్తుకువచ్చేవి. కానీ, ఇప్పుడు మెదక్ అంటే కోతుల రాజ్యంగా పేరు గడించింది. కొత్తవారు జిల్లాకేంద్రానికి వెళ్లాలంటేనే అమ్మో అంటున్నారు. మర్కటాల ప్రతాపం బారినపడి జనాలు హడలిపోతున్నారు. జిల్లావ్యాప్తంగా గడిచిన ఆర్నెళ్లలో 671 మంది కోతుల బారినపడ్డారంటేనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



మెదక్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. పట్టణ వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కోతులు ప్రజలపై, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడి చేస్తున్నాయి. జిల్లాలో గత వారం రోజుల్లో నలుగురు కోతుల దాడిలో గాయపడ్డారని, ఈ ఏడాది ఇప్పటి వరకు అధికారికంగా 671 మంది కోతుల కాటుకు గురయ్యారని గణాంకాలు చెబుతున్నాయి. నమోదు కాని సంఘటనలు ఇంకా ఎక్కువగా ఉండవచ్చని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లలోకి చొరబడి దాడులు

వీధుల్లోనే కాకుండా, కోతులు ఇళ్లలోకి చొరబడి పండ్లు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. దీంతో పాటు పిల్లలు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల బెడదను నియంత్రించాల్సిన బాధ్యత తమది కాదన్నట్లుగా మున్సిపల్, ఫారెస్ట్ అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అజంపురా వీధికి చెందిన అఫ్రోజ్ అన్నారు.

కోతులను నియంత్రించాలి

మెదక్ జిల్లాలో పెరుగుతున్న కోతుల జనాభా నియంత్రణకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) పథకాన్ని వర్తింపజేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వీధి కుక్కల సంఖ్యను నియంత్రించడానికి ఏబీసీ పథకం కింద వాటికి శస్త్రచికిత్సలు చేసి వదిలివేస్తున్నట్లే, కోతులకు కూడా శాస్త్రీయంగా స్టెరిలైజేషన్ పద్ధతిని ఉపయోగించాలని కోరుతున్నారు. కోతుల సంఖ్యను నియంత్రించే విధానాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడానికి అటవీశాఖ వద్ద మౌలిక వసతులు లేవని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా, ఇది అత్యవసర సమస్యగా మారుతోందని, మున్సిపల్, అటవీ శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత దిగజారి విపత్తుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

అర్బన్ ఫారెస్ట్ పార్కుకు పర్యాటక కళ

ఈ నెలాఖరుకు కాటేజీలు సిద్ధం

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్కులో పర్యాటకుల కోసం నిర్మిస్తున్న కాటేజీలను ఈ నెలాఖరు లోపు అందుబాటులోకి తీసుకువస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్ ఫారెస్టు అర్బన్ పార్కును శుక్రవారం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ అర్బన్ ఫారెస్ట్ పార్కులో 42 కాటేజీల నిర్మాణం చేపట్టామని, ఇందులో 22 కాటేజీల పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. కుటుంబ సభ్యులతో సేదతీరేందుకు అన్ని ఏర్పాట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.



నర్సాపూర్ అర్బన్ పార్కులో నిర్మాణంలో ఉన్న కాటేజీలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పటాన్‌చెరు ఎంపీపీలో ఐదు స్థానాలు

పటాన్‌చెరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలానికి చెందిన భానూరు, క్యాసారం, నందిగామ గ్రామాల్లో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట పబ్లికేషన్‌ను నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. భానూరు 3, క్యాసారం, నందిగామ గ్రామాల్లో ఒక్కో ఎంపీటీసీ చొప్పున ఐదు స్థానాల్లో ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీవో యాదగిరి చెప్పారు. జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీ స్థానాలు ఖరారు అయ్యాయని వివరించారు. 2,500 నుంచి 3వేల జనాభాకు ఒక ఎంపీటీసీ స్థానంగా నిర్ణయించామని తెలిపారు. భానూరులో 9,203, క్యాసారం 2,752, నందిగామ 3,257 మంది చొప్పు జనాభా ఉన్నారని వివరించారు.

ముస్కాన్ సక్సెస్

సంగారెడ్డి జిల్లాలో 126 మంది బాల కార్మికులకు విముక్తి

పనిలో పెట్టుకున్న 81 మందిపై కేసులు : ఎస్పీ

6

వానాకాలం.. జ్వరాల ముప్పు

జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి

వైద్యుల సూచనలు పాటించాలి

7



ఆపరేషన్ ముస్కాన్ సక్సెస్

- 126 మంది పిల్లలకు విముక్తి
- 81 మంది యజమానులపై కేసులు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో 15 సంవత్సరాల బాలుడు ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. చదువుపై ఇష్టం ఉన్నప్పటికీ కుటుంబ పేదరికం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా హోటల్‌లో పనిచేస్తూ తన తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉన్నాడు. గత నెల మొదటి వారంలో జిల్లా సంక్షేమ, పోలీసు, కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేయగా సదరు బాలుడు హోటల్‌లో పనిచేస్తున్నట్టు గుర్తించారు. హోటల్ యజమానికి నోటీసులు ఇచ్చి ఆ బాలుడికి విముక్తి కలిగించారు. అంతేగాక బాలుడిని ఓ పాఠశాలలో చేర్పించి సంక్షేమ హాస్టల్‌లో ఉంచారు. దీంతో బాలుడి ముఖంపై చిరునవ్వులు చిందాయి. ప్రస్తుతం ఎంతో హుషారుగా బడికి వెళ్తున్నాడు.

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బడికెళ్లకుండా పని చేస్తున్న బాల కార్మికుల గుర్తింపు కోసం గతనెలలో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ విజయవంతమైంది. జిల్లాలో అనేక మంది బడీడు పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్నారు. నిరక్షరాస్యత, ఆర్థిక వెనుకబాటు వల్ల చిన్నారులు వివిధ పనులు చేస్తున్నారు. తల్లిదండ్రులు లేని మరికొందరు పిల్లలు, తల్లిదండ్రులు ఉండి నిరాదరణకు గురవుతున్న పిల్లలు బిక్షాటన చేస్తున్నారు. ఇలా అనేక మంది పిల్లలు హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, వివిధ పనులు చేస్తున్నారు. ఇలాంటి పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం గతనెల 1వ తేదీ నుంచి 31వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా మహిళా సంక్షేమ శాఖ, కార్మిక, పోలీసు అధికారులు, బాలల సంరక్షణ కమిటీలు సంయుక్తంగా జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, దుకాణాలు, చిన్న చిన్న పరిశ్రమలలో మూకుమ్మడిగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా బాల కార్మికులకు విముక్తి కల్పించి, పాఠశాలలో చేర్పించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా మొత్తం 126 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించారు. ఇందులో 119 మంది బాలురు, 7గురు బాలికలు ఉన్నారు. బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకున్న 81 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోనున్నారు.

సంవత్సరంలో రెండుసార్లు తనిఖీలు..

బాల కార్మికులను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం సంవత్సరంలో ఆరునెలలకోసారి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుంది. జిల్లా మహిళా సంక్షేమ శాఖ, కార్మిక, పోలీసు అధికారులు, బాలల సంరక్షణ కమిటీ అధికారులు సంయుక్తంగా పనిప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఈ తనిఖీలు చేపడతారు. హోటళ్లు, ఇటుక బట్టీల వద్ద, పరిశ్రమలు, దుకాణాల్లో దాడులు నిర్వహించి 18 సంవత్సరాల లోపు బాల కార్మికులను గుర్తించి వారిని శిశు సదనాలకు తరలిస్తారు. అనంతరం బడిలో చేర్పించి చదువు చెప్పిస్తారు.

బాల కార్మికులు కనిపిస్తే ..


పరితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ

18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకున్నా, వెట్టి చాకిరికి గురి చేసినా కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. పిల్లలతో బలవంతంగా బిక్షాటన చేయించినా, పశువుల కాపరులుగా, కిరాణం దుకాణాల్లో, మెకానిక్ షాప్‌లు, హోటళ్లు, ఇటుక బటట్టీలు, పౌల్ట్రీ ఫాంలలో ఇతర ప్రదేశాల్లో పనులు చేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఒకవేళ పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. బాల కార్మికులు ఎవరికైనా కనిపిస్తే చైల్డ్ లైన్ నంబరు 1098 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

160 గ్రాముల గంజాయి పట్టివేత

చేగుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు ఓ ఇంటిలో సోదాలు జరిపి 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపిన వివరాలు ప్రకారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట మండల కేంద్రంలోని నాగులమ్మ కాలనీలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆస్మావుల్ షేక్, అక్రమంగా గంజాయి విక్రయాలు జరుపుతున్నారని సమాచారం మేరకు అతడి ఇంటిలో సోదాలు జరిపారు. అతడి నుంచి 160 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసుకొని రామాయంపేట ఎస్హెచ్‌వోకు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపారు, గంజాయి మత్తు పదార్థాలు విక్రయించిన సేవించిన చట్ట ప్రకారం నేరమని అటువంటి వారి గురించి సమాచారం తెలియపరచాలని కోరారు.



బాలిక అదృశ్యం


దుర్గా భవాని(ఫైల్)

కల్హేర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్‌లో దుర్గాభవాని (14) అనే బాలిక అదృశ్యమయింది. కల్హేర్ ఎస్హై మధుసూధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన అన్నారం రాములు, లక్ష్మిలు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి కూతురు అయిన దుర్గాభవానిని విద్యాభ్యాసం కోసం అమ్మమ్మ గారి గ్రామమైన కల్హేర్‌లోని మేనమామ పోచబోయిన రమేష్ దగ్గర ఉంచారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి కనబడటం లేదని కుటుంబ సభ్యులు శుక్రవారం సమాచారం ఇచ్చినట్లు ఎస్హై తెలిపారు. బాలిక తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుచున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కంగ్టి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీంరాలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసి 7 మంది పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి , ఎస్హై దుర్గారెడ్డి తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

వూసాయిపేట/వెల్దుర్తి,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి నిరుపేదకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం వెల్దుర్తి, మాసాయిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 45వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు.


మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి మండలంలో 385 నూతన రేషన్ కార్డులు, 1489 కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నారని కలెక్టర్ వివరించారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం అని, అర్హులందరికీ రేషన్ కార్డులను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, 2,61,000 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా 220 కోట్ల రూపాయలు జమ చేశామని చెప్పారు.

87 వేల మంది రైతులకు రుణమాఫీ అయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. రేషన్ కార్డు కుటుంబానికి గుర్తింపని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలని ఆమె అన్నారు. రేషన్ కార్డుతో బియ్యంవిద్యా, స్కాలర్‌షిప్, సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు ఉపయోగపడుతుందన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

చిన్నశంకరంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పంటల సాగుకు సరిపడ యూరియా అందుబాటులో ఉందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలకేంద్రంలోని అగ్రోస్ కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ అకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు యూరియాను ఎమ్మార్పీ రేట్లకు అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఫర్టిలైజర్ షాపు యాజమానులకు హెచ్చరించారు. మండలంలోని అన్ని గోదాంలు, విక్రయ కేంద్రాల్లో విధిగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.



గొర్రెల్లో వ్యాధి నిరోధానికి టీకాలే ప్రధానం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెల్లో వ్యాధి నిరోధానికి టీకాలే ప్రాధాన్యమని ఉచిత వ్యాధి నివారణ టీకాలను పాడిరైతులు, గొర్రె కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ వాక్సిన్ పంపిణీ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ వైద్యులు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ గొర్రెల్లో వచ్చే నీలి నాలువ వ్యాధి వల్ల గొర్రెల కాపరులు, పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం గొర్రెలకు ఉచితంగా నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేస్తుందన్నారు.


మందులను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

కామెర్ల వ్యాధితో యువకుడి మృతి


గణేష్ (ఫైల్)

కుకునూరుపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కామెర్ల వ్యాధితో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన న్యాలపోగుల గణేష్(25) బార్బర్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా గణేష్ కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కూడా తీసుకున్నాడు. అనుకోకుండా గణేష్ గురువారం రాత్రి మరణించాడు. మృతుడికి 18 నెలల కుమారుడు ఉన్నాడు. అతడి భార్య ఇప్పుడు గర్భిణీ. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ..

కంగ్టి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని తుర్కవడగాంలో జరిగింది. ఎస్హై దుర్గారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కవడగాం గ్రామానికి చెందిన కింది దొడ్డి సోపాన్(36) గురువారం అదే గ్రామానికి చెందిన షెట్కార్ ఈశ్వరప్పకు చెందిన పొలంలో పత్తి పంటకు మందు స్ప్రే చేయడానికి నీళ్లు పోసేందుకు కూలి పనికి వెళ్లాడు. సమీపంలోని బావి నుంచి సాయంత్రం వరకు నీరు తెచ్చి పోసిన సోపాన్ ఆ తరువాత ఎంత సేపటికి నీటి బిందె తీసుకొని రాక పోవడంతో తోటి కూలీలు శంకర్, తులసీరాంతో పాటు పొలం యజమాని ఈశప్పలు కలిసి పరిసర ప్రాంతాల్లో వెతికారు. చివరకు బావి వద్దకు వెళ్లి చూడగా ఖాళీ బిందె మాత్రమే కనిపించిందని తెలిపారు. దీంతో అనుమానం వచ్చి మోటార్‌తో బావిలోని నీటిని ఖాళీ చేయించగా సోపాన్ మృతదేహం లభ్యమైంది. సోపాన్ అనుమానస్పద మృతి పట్ల ఆయన భార్య మీరాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హై దుర్గారెడ్డి తెలిపారు.


చెరువులో పడి ఒకరు..

కంది, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కవలంపేట ఊదం చెరువులో గురువారం రాత్రి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్హై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కవలంపేట గ్రామానికి చెందిన మున్నూరు జగన్మోహన్ (42) వ్యవసాయ రైతు కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి గ్రామంలోని ఊదం చెరువు కట్ట వద్ద మద్యం సేవించి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడ్డాడు. నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. జగన్మోహన్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామస్థులు, స్థానికుల సహాయంతో శుక్రవారం ఉదయం జగన్మోహన్ మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హై రవీందర్ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక కార్మికుడు..

పటాన్‌చెరు ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జయకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం కైమూర్ జిల్లా కౌదిరామ్ గ్రామానికి చెందిన మురళీకుమార్ (32)పాశమైలారం పారిశ్రామికవాడ సాయిసాగర్ ఫుడ్ ఇండస్ట్రీ పరిశ్రమలో కార్మికుడుగా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో కడుపు నొప్పి వస్తుందంటూ ఫ్యాక్టరీలోని ఒక గదిలో పడుకున్నాడు. నిద్రలోనే మృతి చెందాడు. కౌదిరామ్ గ్రామస్థుడు నితీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువులో మునిగి మత్స్యకారుడు..


సత్యనారాయణ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి చెరువులో నీట మునిగి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చర్లపల్లి గ్రామ శివారులోని నర్సిన్ చెరువులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి పట్టణానికి చెందిన పంపరి సత్యనారాయణ(49) మరో వ్యక్తితో శుక్రవారం చర్లపల్లిలోని నర్సిన్ చెరువులో చేపల వేటకు వెళ్లారు. చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన సత్యనారాయణ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో తోటి మత్స్యకారులు చెరువులో గాలింపు చేపట్టారు. చెరువులో గల్లంతైన మృత దేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య కళావతి, కూతురు లావణ్య ఉన్నారు.









ఫార్మర్ లోడర్ వాహనాన్ని నడుపుతున్న ఆవిష్కర్త తెలుగు రాజశేఖర్

భలే వాహనాలు

బ్యాటరీ బండ్ల తయారీలో యువ ఇంజనీర్

జహీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలం అల్గోల్‌కు చెందిన యువ ఇంజనీర్ తెలుగు రాజశేఖర్ తన ఆవిష్కరణలతో ఆకట్టుకుంటున్నాడు. తనలోని సృజనాత్మకతకు పదును పెట్టి బ్యాటరీతో నడిచే వాహనాలను తయారు చేస్తున్నాడు. పాత వాహనాల విడిభాగాలను ఉపయోగించి సైకిల్, త్రీ వీలర్, ఇప్పుడు నాలుగు చక్రాల ఫార్మర్ లోడర్‌ను తయారు చేశాడు. సైకిల్ తయారీకి రూ. 30 వేలు, త్రీ వీలర్‌కు రూ.40 వేలు, ఫార్మర్ లోడర్‌కు రూ.1.50లక్షలు ఖర్చు చేశానని రాజశేఖర్ తెలిపారు. నారాయణఖేడ్ ప్రభుత్వ ఐటీఐలో డీజిల్ మెకానికల్ కోర్స్‌ను చదివి, జహీరాబాద్ మహీంద్రా కర్మాగారంలో అప్రెంటీస్‌గా పనిచేశాడు. రైతులకు పొలాల్లో ఉపయోగపడే ఫార్మర్ లోడర్‌ను రూపొందించడం పట్ల రాజశేఖర్ సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కొత్త ఆవిష్కరణలను చేపట్టడానికి ఆసక్తి చూపుతున్నానని తెలిపారు. అతని ఆవిష్కరణలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.





రాజశేఖర్ తయారు చేసిన త్రీ వీలర్ వాహనం, సైకిల్

దూళిమిట్ట ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- కూటిగల్ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు
- సిద్దిపేట డీపీవో దేవకీదేవి

మద్దూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట ఎంపీడీవో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉండటం లేదని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) దేవకీదేవి ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఆమె దూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. గ్రామానికి మంజూరైన 218 ఇళ్లలో 114 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంలో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి అనితకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. తన సందర్శన సమయంలో ఎంపీడీవో మీసాల వీరరాజ్ అందుబాటులో లేకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు డీపీవో తెలిపారు. అనంతరం మద్దూరు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఓటరు జాబితా తయారీపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీఈవో రాంమోహన్, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేసి, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్కా రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల గ్రామాల్లో పాలన స్తంభించిపోయిందని, సమస్యలు పేరుకుపోతున్నాయని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా కాలయాపన చేయడం బీసీల పట్ల వారికి ఏమేరకు చిత్తశుద్ధి ఉందో తెలియజేస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదానికి తలుపులు తెరిచిందని, ట్రంప్ 25 శాతం సుంకాలను పెంచినా మోదీ ప్రభుత్వం నోరు మెదపడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పథకాలను నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, కార్యదర్శి మల్లారెడ్డితో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే రామాలయం స్వాధీనానికి కుట్ర

- ఆందోళనతో వెనుదిరిగిన ఎండోమెంట్ అధికారులు

మెదక్ అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ కక్షతోనే మెదక్ జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు కుట్ర జరుగుతోందని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆరోపించారు. దేవాదాయశాఖ అధికారులు రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఆలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి వచ్చిన దేవాదాయశాఖ అధికారులను బీజేపీ నాయకులు, భక్తులు అడ్డుకున్నారు. పట్టణ సీఐ మహేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బీజేపీ నాయకులు 'ఎండోమెంట్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఈ విషయం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి వెళ్లడంతో, ఆయన ఫోన్‌లో అధికారులతో మాట్లాడి వెంటనే వెళ్లిపోవాలని హెచ్చరించారు. దీంతో దేవాదాయశాఖ సిబ్బంది వెనుదిరిగారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా భక్తులు, దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందిందని, రాజకీయ ఫిర్యాదుతో స్వాధీనం చేసుకోవడం సరికాదని అన్నారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు వచ్చామని, అనివార్య కారణాల వల్ల స్వాధీనం ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

వానాకాలం.. జ్వరాల ముప్పు

- జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి
- వైద్యుల సూచనలు పాటించాలి

మెదక్, కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణం చల్లబడి ఆహ్లాదంగా ఉంటుంది. కానీ ఈ చల్లని వాతావరణం అనేక రోగాలను కూడా తీసుకొస్తుంది. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు వంటివి ఎక్కువగా ఉంటాయి. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు కూడా ఎక్కువగా ప్రబలుతాయి. వీటి బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడం చాలా ముఖ్యం. వైద్యుల సూచనలు పాటించాలి.



జ్వరాలు.. వాటి లక్షణాలు

- వైరల్ జ్వరాలు జ్వరాలు ఉన్నపళంగా వస్తాయి. జ్వరం చాలా ఎక్కువగా (102 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు) ఉంటుంది. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం, వాంతులు, అజీర్తి వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు శరీరంపై దద్దుర్లు కూడా వస్తాయి.
- దోమల ద్వారా డెంగీ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. అధిక జ్వరం, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, తలనొప్పి వంటివి ఈ జ్వరాల లక్షణాలు. వీటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు.
- కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల టైఫాయిడ్ వస్తుంది. ఇది సాధారణంగా కడుపు నొప్పి, వాంతులు, జ్వరంతో మొదలవుతుంది.
- చికున్‌గున్యా కూడా దోమల ద్వారా వ్యాప్తి చెందే వైరల్ జ్వరం. దీని లక్షణాలు అధిక జ్వరం, కీళ్ల నొప్పులు.
- వర్షాకాలంలో వాతావరణ మార్పుల వల్ల సాధారణ జలుబు, ఫ్లూ రావడం సర్వసాధారణం. గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కాచి చల్లార్చిన నీటినే తాగాలి. బయటి ఆహారం, ఫాస్ట్‌ఫుడ్ తినడం మానేయాలి. తాజా, వేడిగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినాలి.
- ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. నీరు నిల్వ ఉండే పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ డబ్బాలను పారేయాలి. దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలకు నెట్‌లు వాడాలి.
- చేతులను తరచుగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. వర్షంలో తడిస్తే వెంటనే పొడి బట్టలు వేసుకోవాలి.
- రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి పౌష్టికాహారం తీసుకోవాలి. నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు ఎక్కువగా తింటే మంచిది.
- జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు లాంటి లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం అస్సలు చేయకూడదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

వర్షాకాలం జాగ్రత్తలు ఎంతో ముఖ్యం



వర్షాకాలం వచ్చిందంటే చాలు చిన్నపిల్లలు ఎక్కువగా అనారోగ్యానికి గురి అవుతుంటారు. బయటకు వెళితే తప్పకుండ గొడుగు లేదా రెయిన్‌కోట్‌లను తీసుకెళ్లాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వేడి ఆహారాన్ని తీసుకోవాలి. పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి. వర్షంలో తడిస్తే జలుబు, జ్వరం వస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. దగ్గు, దమ్ము ఉన్న వారు ఎక్కువ జాగ్రత్తగా వహించాలి. డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది కాబట్టి నిర్లక్ష్యం చేయకూడదు.

- డాక్టర్ నాగేంద్రబాబు, ఎంబీబీఎస్, డీఎన్‌బీ, పిల్లల వైద్య నిపుణులు



జెండా ఊపి ప్రారంభిస్తున్న పాదయాత్ర



పాదదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర్, పొన్నం, వివేక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు



పాదయాత్రలో జనం

జనహిత జోష్

(5వ పేజీ తరువాయి) పనిచేసే పార్టీ అని అన్నారు.

దామోదర్‌కు ప్రశంసలు

జనహిత పాదయాత్ర సందర్భంగా మంత్రి దామోదర్‌ను.. మహేశ్ కుమార్ గౌడ్, మీనాక్షీ నటరాజన్, జగ్గారెడ్డి ప్రశంసించారు. తాను ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉన్నప్పటికే దామోదర్ ఎమ్మెల్యే అయ్యారని, ఆయన నుంచి తానెంతో నేర్చుకున్నానని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన గురువని అన్నారు. తనకు.. అప్పటి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌కు దామోదర్ భీష్ముడిలా మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. మీనాక్షీ నటరాజన్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ప్రియతమ నాయకుడైన దామోదర్ ఆ ప్రేమకు ఎందుకు అర్హుడో ఇక్కడి అభివృద్ధిని చూస్తుంటేనే తెలుస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆలోచన.. నిబద్ధతతోనే ఆయన ఈస్థాయికి ఎదిగారని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, త్రిష దామోదర్, గిరిజా షెట్కార్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో చిందేస్తున్న మంత్రి దామోదర్



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

మట్టి.. కొల్లగొట్టి

- అనుమతుల పేరుతో అర్ధరాత్రి అక్రమ రవాణా
- ప్రశ్నిస్తే సీఎం తెలుసంటూ బెదిరింపులు

కొల్చారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామంలో అక్రమ మట్టి రవాణా జోరుగా సాగుతోంది. స్థానిక నాయకుల అండతో ఓ నాయకుడు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నన్నెవరూ అడ్డుకోలేరు..

పోతంశెట్టిపల్లిలోని ఏడుపాయలకు వెళ్లే రహదారి పక్కన సుమారు 20 ఎకరాల వ్యవసాయ భూమిని లీజుకు తీసుకున్న కొందరు వ్యక్తులు రిసార్ట్, భవనాలను నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాల కోసం పెద్ద మొత్తంలో మట్టి అవసరం కావడంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పాపన్నపేట మండలం నుంచి తెచ్చిన ధ్రువీకరణ పత్రాలతో రాత్రిపూట నంబర్ లేని టిప్పర్ వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు ప్రశ్నిస్తే, ఆ నాయకుడు 'నాకు సీఎం తెలుసు, నన్నెవరూ అడ్డుకోలేరు' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని సమాచారం.

తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు

దీనిపై స్పందించిన తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అనుమతి పత్రాలు తీసుకురావాలని ఆదేశించి వాటిని పరిశీలించగా, అందులో లారీ నంబర్లు, సమయపాలన లేకపోవడం గమనార్హం. రాత్రిపూట మట్టి తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అనుమతులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అయితే, తహసీల్దార్ ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అక్రమార్కులు మట్టి రవాణా కొనసాగిస్తున్నారు. ఈ నిర్మాణాలు బఫర్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రిసార్ట్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని పోతంశెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శి అరుణ కూడా ధృవీకరించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాను, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టిని తరలిస్తున్న టిప్పర్

రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత

సిద్దిపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో శుక్రవారం అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను, ఒక ఎక్స్‌కవేటర్‌ను టాస్క్‌ఫోర్స్, రూరల్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బ మల్లేశం భూమి నుంచి ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి, టిప్పర్ల ద్వారా సిద్దిపేటకు తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు, ఆ వాహనాలను పట్టుకుని కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు

- ఈ నెల 16న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం

మెదక్ అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం రైల్వేశాఖ భారత్ గౌరవ్ పేరుతో ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పివి.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం మెదక్ రైల్వే స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 16న సికింద్రాబాద్ నుంచి ఈ ప్రత్యేక రైలు ప్రారంభమవుతుందని చెప్పారు. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగాలు పేరుతో ఈ రైలు ఉజ్జయిని వరకు ప్రయాణిస్తుందన్నారు. సికింద్రాబాద్ నుంచి కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, పూర్ణా మీదుగా ఈ ప్రయాణం సాగుతుందని తెలిపారు. ఒక్కో వ్యక్తికి టికెట్ ధర సాధారణ ప్యాకేజీకి రూ.14,600, 3ఏసీకి రూ.22,900, 2ఏసీకి రూ.29,900గా నిర్ణయించామని వివరించారు. ఈ ప్యాకేజీలో పూర్తి భద్రత, ఆహారం, హోటల్ సదుపాయాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, లేదా 9701360701, 9281030740 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌సీఎంఎంకు ఐఐటీహెచ్ ఎంపిక

- బాంబే, రూర్కీ, ధన్‌బాద్ ఐఐటీలకూ చోటు

కంది, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఖనిజాల అన్వేషణకు ఎన్‌సీఎంఎం (నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్) కింద నాలుగు ఐఐటీలలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ ఎంపికైంది. ఐఐటీహెచ్‌తోపాటు, బాంబే, రూర్కీ, ధన్‌బాద్ ఐఐటీలు సహా ఏడు ప్రతిష్ఠాత్మక సంస్థలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సంస్థలు కీలకమైన ఖనిజాల రంగంలో దేశ శాస్త్ర సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి, సాంకేతికతను ముందుకు తీసుకెళ్లడానికి పరిశోధనలు చేస్తాయి. ఎలక్ట్రానిక్స్ రక్షణ, అంతరిక్షం వంటి అధునాతన సాంకేతికత రంగాలతో పాటు, క్లీన్ ఎనర్జీ, మొబిలిటీ రంగాలకు కీలకమైన ముడి పదార్థాల సరఫరాలో దోహదపడనున్నాయి. ఐఐటీహెచ్, ఐఐటీ బాంబే, ఐఐటీ రూర్కీ, ఐఐటీ ధన్‌బాద్ సంస్థలు గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కీలకమైన ఖనిజాలలో పరిశోధన కన్సార్టియంగా పని చేస్తాయని తెలిపింది.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సినిమారోడ్డు, శివాజీనగర్, జలాల్‌బాగ్, అంబేద్కర్ సర్కిల్, స్టేడియం గ్రౌండ్, సాయికృపానగర్, నేతాజీ నగర్, బాబానగర్, భగత్‌సింగ్‌నగర్, నారాయణరెడ్డి చౌక్, ఉప్పర్ బజార్, శివంగుల ఏరియాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

చేగుంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చేగుంట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 9 అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చక్రవర్తి తెలిపారు. నెలకు రూ.28 వేలు వేతనం లభిస్తుందని, ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్ లేదా నాన్ ఇంజినీరింగ్‌లో ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ మ్యాథ్స్, పీజీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 5న చేగుంట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అర్హత సాధించిన అధ్యాపకులు రాష్ట్రంలోని ఏ పాలిటెక్నిక్ కళాశాలలోనైనా బోధించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

తూప్రాన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గంగమల్లు తెలిపారు. శుక్రవారం ఆయన తూప్రాన్ పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మండలంలో 3356 యూరియా బస్తాల నిల్వలు ఉండగా, మరో 1,200 బస్తాలు వచ్చాయని తెలిపారు. దీంతోపాటు, కాంప్లెక్స్ ఎరువులు 5,125 బస్తాలు, డీఏపీ 1000 బస్తాలు, ఎంవోపీ పొటాష్ 479 బస్తాలు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ 125 బస్తాలు, అమోనియా 92 బస్తాలు ఉన్నాయని వివరించారు. మండలంలో ఇప్పటివరకు 8,103 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని, మొక్కజొన్న 486 ఎకరాల్లో, స్వీట్‌కార్న్ 79 ఎకరాల్లో, కూరగాయలు 496 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు తీసుకువచ్చి ఎరువులను పొందవచ్చని, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఆధార్ కార్డు ఆధారంగానే అమ్మకాలు జరుగుతాయని ఆయన చెప్పారు.

నేటి నుంచి అంతర్‌రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్

జహీరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో ఆగస్టు 2, 3 తేదీలలో అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ ఫుట్‌బాల్ చాలెంజ్ ట్రోఫీలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాలకు చెందిన 19 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేత, రన్నరప్ జట్లకు నగదు బహుమతి, ట్రోఫీని అందజేస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయాల పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలం

● వీహెచ్‌పీ నేత మౌనిక

రామాయంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆలయాల పరిరక్షణలో గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని వీహెచ్‌పీ నేత, హైకోర్టు న్యాయవాది సుంకర మౌనిక విమర్శించారు. ప్రభుత్వానికి చేతకాకపోతే రాష్ట్రంలోని మహిళలకు దేవాలయాలను దత్తత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రామాయంపేటలోని వైశ్యభవనంలో జరిగిన వరలక్ష్మి వ్రతం, శిశు మందిర్ కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యం, మల్లేశంలు పాల్గొన్నారు.

జై గణేష్ భక్తి సమితి జిల్లా ఇన్‌చార్జిగా నాగరవళి

కంది, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జై గణేష్ భక్తి సమితి సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా కందికి చెందిన ముదిగొండ నాగరవళి నియమితులయ్యారు. ఈ మేరకు సమితి వ్యవస్థాపకులు జైన కుమార్ చారి శుక్రవారం రాష్ట్ర, జిల్లా కమిటీ నియామక పత్రాలను జారీ చేశారు.

రైతులకు అవగాహన

శివ్వంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు తొంభై రోజుల క్యాంపు శిక్షణలో భాగంగా గ్రామాలను సందర్శిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం శివంపేటలోని రైతులకు వరి తెగుళ్ల నివారణ, జీవ ఎరువుల వాడకం గురించి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, విద్యార్థులు మరియం ఫాతిమా, షేక్ హబీబా, హిమబిందు, జానకి, కేశవి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా మార్కెట్ భవనం


నిర్మించిన దుకాణాలు

వెజ్, నాన్‌వెజ్ ఒకేచోట

● రెండు అంతస్థులు, 45 దుకాణాలు
● సర్వం సిద్ధమైనా ప్రారంభంలో జాప్యం
● 18 నెలలుగా తప్పని ఎదురుచూపులు

పటాన్‌చెరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో నిర్మించిన మీట్ మార్కెట్ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, గత 18 నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. సుమారు రూ.6కోట్లతో నిర్మించిన ఈ భవనంలో మొత్తం 45 దుకాణాలు ఉన్నాయి. వీటిని వచ్చే నెలలో వేలం ద్వారా కేటాయించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 11 దుకాణాలను రిజర్వేషన్ పద్ధతిలో కేటాయిస్తారు. పటాన్‌చెరు మార్కెట్ ప్రాంతంలో నిర్మించిన ఈ రెండు అంతస్తుల భవనంలో కూరగాయలు, మాంసం వంటివి ఒకేచోట లభించనున్నాయి. జీహెచ్‌ఎంసీ జనరల్ నిధుల నుంచి రూ.5.93 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో 2017లో రూ.3.95 కోట్లు, 2023లో రూ.1.98 కోట్లు మంజూరయ్యాయి. కింది అంతస్తులో 17, పై అంతస్తులో 28 దుకాణాలు ఉన్నాయి. వినియోగదారుల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా సెల్లార్ కూడా నిర్మించారు. దుకాణాల అద్దెలు చదరపు అడుగుకు రూ.25గా నిర్ణయించారు. దుకాణం పరిమాణాన్ని బట్టి నెలకు రూ.3,150 నుంచి రూ.4500 వరకు అద్దె ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు అద్దెలో ప్రత్యేక రాయితీలు ఉంటాయని అధికారులు తెలిపారు. వేలంలో దుకాణం దక్కించుకున్నవారు మూడు నెలల అద్దెను అడ్వాన్స్‌గా చెల్లించాల్సి ఉంటుంది. కాగా, మరో 30 రోజుల్లో ఈ మార్కెట్ ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తగ్గనున్న ట్రాఫిక్ సమస్య..

ఈ మీట్ మార్కెట్ ప్రారంభమైతే రోడ్డుపై వ్యాపారాలు చేసే వారిని ఇందులోకి తరలించి, ట్రాఫిక్ సమస్యను తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం పటాన్‌చెరు నుంచి దౌల్తాబాద్, హత్నూర, జిన్నారం మండలాలకు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. మీట్‌మార్కెట్ భవనంలోకి రోడ్డుపై ఉన్న అన్ని రకాల దుకాణాలు తరలించిన అనంతరం రోడ్డు మార్గం వెడల్పు చేయనున్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి


ఇందిరమ్మ ఇంటి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను కాంగ్రెస్ నెరవేరుస్తున్నదని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఖేడ్ మున్సిపల్ పరిధిలోని భూమయ్య కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఆర్థిక సహాయంతో పాటు ఇసుకను ఉచితంగా అందిస్తామని, ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు లేని పేదలకు మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష రుణం ఇప్పిస్తామని చెప్పారు. జూకల్ శివారులో నిర్మించిన 775 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను దివ్యాంగులు, వితంతువులు, స్థలం లేని అర్హులైన వారికి కేటాయించడానికి వార్డుల వారీగా లబ్ధిదారులను గుర్తిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకట శివయ్య, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, అర్జున్, ప్రభాకర్ రెడ్డి, వార్డు అధికారులు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్ శివార్లలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ రుర్బన్ పథకం కింద నిర్మించిన కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం అందోల్ నియోజకవర్గంలో నిర్వహించిన జనహిత పాదయాత్రలో పాల్గొనడానికి ఆయన కార్యకర్తలతో కలిసి వెళ్లారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : జడ్పీ సీఈవో


రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో జానకీరెడ్డి

పుల్కల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ సీఈవో కె. జానకీరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన చౌటకూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల జాబితా సిద్ధంగా ఉన్నాయా అని ఎంపీడీవో శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. విధులకు డుమ్మా కొట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎప్పుడైనా నోటిఫికేషన్ వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ కె. శంకర్ ఉన్నారు.

హైవేలపై కాదు.. గ్రామీణ రోడ్లపై నడవండి

● మీనాక్షి నటరాజన్‌కు మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ బహిరంగ లేఖ

పుల్కల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జనహిత పాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బహిరంగ లేఖ రాశారు. 'మీరు ఏం ఆశించి పాదయాత్ర చేస్తున్నారు? జాతీయ రహదారులపై కాకుండా గ్రామీణ రోడ్లపై నడవండి. యువతుల వివాహానికి ఇస్తామన్న తులం బంగారం ఏమైంది' అంటూ ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆయన లేఖలో ప్రస్తావించారు. ఆందోల్ నియోజకవర్గానికి ఆమెకు స్వాగతం పలుకుతూనే, పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. మీరు జాతీయ రహదారులపై కాకుండా గ్రామీణ ప్రాంతాల గుండా నడిస్తే మీకు కాంగ్రెస్ పాలనలోని వాస్తవాలు తెలిసేవి అన్నారు. గ్రామీణ రోడ్లపై ఉన్న గుంతలు, పేరుకుపోయిన చెత్త, తాళాలు వేసిన గ్రామ పంచాయతీ భవనాలను చూసేవారని ఎత్తిచూపారు. రైతుల బతుకులు, రైతుబంధు, రుణమాఫీ అమలు, గంటకోసారి పోయే కరెంటు గురించి తెలుసుకునే అవకాశం ఉండేదని చెప్పారు. పార్టీని నిలబెట్టడానికి కష్టపడిన కార్యకర్తలు ఇప్పుడు మంత్రి దామోదర రాజనరసింహతో తిట్లు తింటున్నారని, వారిని ఓదార్చాలని లేఖలో పేర్కొన్నారు. ఈ పాదయాత్ర ఇచ్చిన హామీల అమలుకు దోహదపడాలని ఆశిస్తున్నట్లు క్రాంతికిరణ్ లేఖను ముగించారు.

భవిత కేంద్రం భవనానికి భూమి పూజ

రేగోడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకత్వంలో విద్య, వైద్యం, అభివృద్ధి రంగాల్లో ప్రభుత్వం అగ్రగామిగా ఉందని రేగోడు మాజీ పీఏసీఎస్ చైర్మన్ శ్యామ్‌రావు కులకర్ణి, మాజీ సర్పంచ్ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం రేగోడు పాఠశాల ఆవరణలో రూ.9.5 లక్షల నిధులతో మంజూరైన భవిత కేంద్ర భవన నిర్మాణానికి అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏఈ యాదగిరి మాట్లాడుతూ, భవిత కేంద్రం భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, రెండు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అలాగే, గ్రంథాలయ భవన నిర్మాణానికి విద్యుత్ లైన్ అడ్డుగా ఉండటంతో పనులు ఆగిపోయాయని, లైన్‌ను మార్చేందుకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. రేగోడులోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గురునాథ్, భవిత కేంద్రం నిర్వాహకులు సుకన్య, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

●సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు


మాట్లాడుతున్న గొల్లపల్లి జయరాజు

పుల్‌కల్, ఆగస్టు 1 ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, హక్కుల రక్షణకై పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. పుల్కల్ మండలం సింగూరులో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్లు రాయితీలిస్తున్న ప్రభుత్వం, ఓట్లేసి గెలిపించిన సామాన్య ప్రజలపై మాత్రం జీఎస్టీ పేరుతో పన్నుల భారాలు మోపుతున్నదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలా పరిష్కారానికి పోరాటాలు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్, పుల్కల్, చౌటకూర్ మండలాల బాధ్యులు కృష్ణ, ఏర్పుల నాగభూషణం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి : డీఈవో రాధకిషన్

చిన్నశంకరంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రాధకిషన్ అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ హైస్కూల్లో కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా తెలుగు సబెక్టు బోధనపై తెలుగు పండితులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవిందర్‌రెడ్డి, బక్కప్ప, జరీన, నరేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'ఫ్రైడే-డ్రైడే'

పెద్దశంకరంపేట/వెల్దుర్తి/చిన్నశంకరంపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తప్పకుండా పరిశుభ్రత పాటించాలని పెద్దశంకరంపేట ఎంపీడీవో షాకీర్ అలీ అన్నారు. శుక్రవారం ఆయన పేట మండల పరిధిలోని మూసాపేట గ్రామంలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మానేపల్లిలో మండల ప్రత్యేక అధికారిణి నీలిమ పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లోని పాత కుండలు, గుంతలు, టైర్లను తొలగించారు.

కాలనీల్లో శుభ్రతకు ప్రాధాన్యం

● కార్పొరేటర్ పుష్పా నాగేశ్


దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ కాలనీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ పుష్పా నాగేశ్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కానుకుంటలో మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్స్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి పర్యటించారు. మురుగునీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారి చేయించారు.

'కనీస వేతనాలు చెల్లించాలి'


దేవాదాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న పూజారులు, ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటేశ్వరరావును కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు, పూజారులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన వంటి బీమా పథకాలను కూడా వర్తింపజేయాలని కోరారు.

ఫేస్ రికగ్నేషన్‌తో పింఛన్ల పంపిణీ


ఫేస్ రికగ్నేషన్ ద్వారా పెన్షన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

జిన్నారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) విధానంలో మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. శుక్రవారం జిన్నారంలో పింఛన్ లబ్ధిదారులకు పోస్టాఫీసు సిబ్బంది ఈ కొత్త విధానం ద్వారా పింఛన్లు అందించారు. వృద్ధుల వేలిముద్రలు కొన్ని చోట్ల సరిగా పని చేయకపోవడంతో, సెల్‌ఫోన్‌లో ప్రత్యేక యాప్ ద్వారా ముఖ గుర్తింపు ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, అనర్హులను తొలగించి, అర్హులైన వారికే పింఛన్లు అందజేసేందుకు ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు తపాలా శాఖ సిబ్బంది తెలిపారు.

డీఐఈవోపై చర్యలు తీసుకోండి

● పీడీఎస్‌యూ

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి గుర్తింపు లేకుండా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోని ఇంటర్మీడియట్ అధికారి (డీఐఈవో) గోవిందరావుపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డిలో డీఆర్‌వో పద్మజారాణికి పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గుర్తింపు లేని కళాశాలలు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పీడిస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయమై డీఐఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో విద్యార్థులను ఏకం చేసి జిల్లావ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక చైతన్య యాత్ర

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 18 వరకు 'అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర' నిర్వహిస్తున్నట్లు కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొండాపూర్ మండలం గొల్లపల్లి గ్రామంలోని బస్టాండు వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అక్కడి నుంచి యాత్ర జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో కొనసాగి, పాపన్నగౌడ్ జీవిత చరిత్ర గురించి ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. ఈ యాత్రను గౌడ్ సోదరులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

తారా కాలేజీ అధ్యాపకుడికి డాక్టరేట్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జీవశాస్త్ర విభాగ అధిపతి రమేష్‌కు మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. కళాశాలలో ఎగ్జామినేషన్స్ బ్రాంచ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్‌గా కూడా పనిచేస్తున్న రమేష్‌కి ఈ డాక్టరేట్ లభించడం సంతోషకరమని ప్రిన్సిపాల్ డా. రమేష్ అన్నారు. శుక్రవారం కళాశాల తరఫున ఆయనను సన్మానించారు.

వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు

నారాయణఖేడ్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం వీధి కుక్కల బెడద నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పలు కాలనీల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతుండటంతో స్థానికులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కుక్కలను పట్టుకొని, ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రానికి తరలించడానికి చర్యలు తీసుకున్నారు. వలల ద్వారా కుక్కలను పట్టుకునేవారిని పిలిపించి, వాటిని వ్యాన్‌లో తరలించే ప్రక్రియ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కమిషనర్ జగ్జీవన్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించి సూచనలు ఇచ్చారు.

ఇన్వర్టర్, బ్యాటరీలు వితరణ



ఇన్వర్టర్, బ్యాటరీలు అందజేస్తున్న ఎల్లా లింగయూత్ సభ్యులు

కంగ్టి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కంగ్టి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం కంగ్టికి చెందిన ఎల్లా లింగ యువజన సంఘం సభ్యులు ఉచితంగా ఇన్వర్టర్, బ్యాటరీలు అందజేశారు. ఆసుపత్రిలో పాత బ్యాటరీలు సరిగా పనిచేయకపోవడంతో కరెంటు లేని సమయంలో వైద్య సేవలకు అంతరాయం కలుగుతోందని వైద్యాధికారి నాగమణి తెలిపారు. ఈ కొత్త ఇన్‌వెర్టర్ వైద్య సేవలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఎల్లా లింగ యూత్ సభ్యులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజు, విశ్వనాథ్, పండరి, విజయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషపై ఉపాధ్యాయులకు శిక్షణ

మనోహరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషపై వివిధ మండల కేంద్రాల ఉపాధ్యాయులకు కాళ్లకల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్యంతర శిక్షణా శిబిరం నిర్వహించారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని కాళ్లకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నర్సింగం సమావేశం నిర్వహించారు. తెలుగు భాషా పై ప్రారంభ పరీక్ష, కనీస మౌలిక అభ్యసన స్థాయి, సాంకేతిక వినియోగం, మొదలగు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తెలుగు విషయ నిపుణులు రావికోటి శ్రీధర్, అంజిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'తల్లిపాలతో పిల్లల్లో ఎదుగుదల'

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలలో పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు ఉంటాయని పలువురు వక్తలు అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఖేడ్ మండలం లింగాపూర్ , చిలప్‌చెడ్ మండలం సొమ్లతండా, శివ్వంపేట మండలం శివయ్యగూడెం, తూప్రాన్ పట్టణం తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని కరస్‌గుత్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ జివేరియా బేగం ఆధ్వర్యంలో బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత, నిజాంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ తరిణి, సూపర్‌వైజర్ సంతోషిమాత, గోమారం సెక్టార్ సూపర్‌వైజర్ వసుమతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులతో అధిక దిగుబడులు

● జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్

కౌడిపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నానో ఎరువులను వాడడం వల్ల రైతులు స్థిరంగా అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ అన్నారు. శుక్రవారం తునికిలోని డాక్టర్ రామానాయుడు కృషి విజ్ఞాన జ్యోతిలో గ్రోమోర్ కోరమాండల్ ఫర్టిలైజర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా రైతుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రతినిధి రోషన్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్తలు రవి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

చేగుంట/వెల్దుర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలంలోని పలు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ వరి పొలాలను సందర్శించి, తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు చేశారు. శుక్రవారం వెల్దుర్తి శివారులోని వరి పొలాలను వ్యవసాయ శాఖ ఏవో ఝాన్సీ పరిశీలించారు. ఎకరానికి 60 కిలోల యూరియా మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు వందన, మాజీద్ తదితరులు పాల్గొన్నారు.


వెల్దుర్తిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు